అంతా సమీప బంధువులే..

ఎల్లుట్లలో విషాదఛాయలు

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వారంతా సమీప బంధువులే.. రెక్కాడితేగాని డొక్కాడని కుటుంబాలు. అందరూ కలసి రోజూ కూలి పనులకెళ్లి వచ్చి పూట గడుపుకుంటూ ఉంటారు. ఎప్పటిలాగానే శనివారం ఉదయం తమ గ్రామం నుంచి 50 కిలోమీటర్ల దూరంలోనున్న గార్లదిన్నె మండలం కలగాసుపల్లికి వ్యవసాయ పనుల నిమిత్తం వెళ్లారు. అరటి చెట్లకు ఎరువులు వేసే పనికోసం వెళ్లి మధ్యాహ్నం తిరుగు ప్రయాణమైన సమయంలో వారు ప్రయాణిస్తున్న ఆటోకి ఆర్టీసి బస్సు ఢీ కొనడంతో ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ఏడుగురు మృత్యువాతపడ్డారు. దీంతో ఎల్లుట్లలోని దళితవాడలో విషాదఛాయలు అమలుముకున్నాయి.

ఆటో ప్రమాదంలో మృతి చెందిన చిన్న నాగన్న, చిన్న నాగమ్మ ఇద్దరూ ఒకేసారి మృతి చెందారు. భార్యాభర్త ఇద్దరూ వ్యవసాయ పనుల నిమిత్తం వెళ్లివస్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. వీరికి ఇద్దరు కుమార్తెలుండగా ఒకరికి వివాహమైంది. మరో కుమార్తె ఇంటర్మీడియట్ చదువుతోంది. ఇప్పుడు తల్లిదండ్రులు ఇద్దరూ చనిపోవడంతో ఆమెకు అనాథగా మారింది.

వెళ్లొస్తానని చెప్పి వెళ్లిపోతివా..!

నీవు ఇండికాడే ఉండు... నేను వెళ్లొస్తానని చెప్పిపోతివే... అంటూ జయరాముడు భార్య కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది. ఎప్పుడు ఇద్దరూ కలసి పనికెళ్లేవారు... కాని శనివారం ఉదయం భార్యను వద్దని జయరాముడు మాత్రమే పనికెళ్లాడు. తిరుగు ప్రయాణంలో జరిగిన ప్రమాదంలో మృతి చెందాడు. జయరాముడుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. వీరిద్దరూ కడా ఇంటర్మిడియట్ చదువుతున్నారు.

తల్లిని కోల్పోయి సర్వజన ఆసుపత్రి వద్ద రోదిస్తున్న బాలిక

ఘటనా స్థలంలో మృతి చెందిన మహిళలు

కూలీల ఇంట.. మృత్యుఘోష

- ఆటోను ఢీకొన్న ఆర్టీసీ బస్సు
- ఎనిమిది మంది వ్యవసాయ కూలీలు మృతి
- ఐదుగురికి తీవ్ర గాయాలు
- మృతులంతా దళితులు, బంధువులు
- కూలీల ఇంట పెను విషాదం
- కన్నీటి సంద్రమైన ఎల్లుట్ల దళితవాడ
- సర్వజనాసుపత్రిలో మిన్నంటిన రోదనలు

వారంతా వ్యవసాయ కూలీలు. కుటుంబం అంతా కూలి పనులకు వెళ్తేనే జీవనం గడిచేది. మండేకడుపు నింపుకోవాలంటే కూలి పనులకు వెళ్లాల్సిందే. సొంతూరులో పనులు లేక పక్క గ్రామాలకు కూలి పనులకు వెళ్తుం టారు. ఇంటి పెద్దకు తోడుగా పనికెళ్తే నాలుగు పైసలొస్తాయని భార్యాభర్తలిద్దరూ పనులకు వెళ్తుంటారు. రెక్కల కష్టాన్ని నమ్ముకుని సాగించే పేద కూలీల జీవన పోరాటంలో పెనుప్రమాదం చీకట్లను నింపింది. ఊహించని పరిణామం శ్రమజీవుల ఇంట మృత్యుఘోషను మోగించింది. పనులు ముగించుకుని ఇంటికి తిరిగి వస్తున్న వారికి అదే చివరి రోజు అయ్యింది. మరికొంత సేపట్లో ఇంటికి చేరుకోవాల్సి ఉండగా మృత్యుపాశానికి ఎనిమిది మంది కూలీలు బలయ్యారు. శనివారం నాడు గార్లదిన్నె మండలం తలగాసిపల్లి ఎన్‌హెచ్-44పై ఆటోను ఆర్టీసీ బస్సు ఢీకొన్న ప్రమాదం పేద కూలీల ఇంట తీవ్ర విషాదాన్ని నింపింది.

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి
గార్లదిన్నె, పుట్లూరు

అనంతపురం జిల్లా పుట్లూరు మండలం ఎల్లుట్ల గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీలు 13మంది కూలి పనుల నిమిత్తం గార్లదిన్నె మండలం తిమ్మంపేట గ్రామంలో అరటి పిలకలకు మందు పిచికారీ చేసేందుకు సోమవారం ఉదయం ఆటోలో వెళ్లారు. అక్కడ పనులు ముగించుకుని కూలీలు బాలపెద్దయ్య(50), డి.నాగమ్మ(45), బి.నాగమ్మ(50), డి.రామాంజినమ్మ(42), చిన్న నాగన్న(52), కొండమ్మ(48), జయరాముడు(40), ఈశ్వరయ్య(55)తోపాటు మరో ముగ్గురు వెళ్లిన ఆటోలోనే స్వగ్రామానికి బయల్దేరారు. గార్లదిన్నె మీదుగా నార్పలకు వెళ్తుండగా తలగాసిపల్లి గ్రామం వద్ద ఆటో ఎన్‌హెచ్-44పైకి ఎక్కింది. ఇదే సమయంలో శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న ధర్మవరం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు వేగంగా వచ్చి ఆటోను ఢీకొంది. దీంతో ఆటో పల్టీలు కొట్టింది. ఈ ప్రమాదంలో ఘటనా స్థలంలో బాల పెద్దయ్య, డి.నాగమ్మ, బి.నాగమ్మలు మరణించారు. మిగిలిన పది మంది కూలీలు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు పోలీసులు, 108కు సమాచారం అందించడంతో వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108లో అనంతపురం సర్వజన ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ డి.రామాంజినమ్మ, చిన్ననాగన్న, కొండమ్మ, జయరాముడు, ఈశ్వరయ్య మరణించారు. గంగాధర, రామాంజినమ్మ, సెద్దులమ్మ, లక్ష్మిదేవి, ఆటోడ్రైవర్ నీలకంఠలు తీవ్రగాయాలతో ఆసుపత్రిలో చికిత్సలు పొందుతున్నారు.

ప్రమాదానికి కారణం అయిన ఆర్టీసీ బస్సు

ప్రమాదంలో దెబ్బ తిన్న ఆటో

మృతలంతా పేద కూలీలు

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పుట్లూరు మండలం ఎల్లుట్ల గ్రామానికి కూలీలంతా దళిత పేద కూలీలు. ప్రతి రోజూ ఉదయాన్నే కుటుంబం అంతా కూలి పనులకు వెళ్తాంటారు. భార్యాభర్తలిద్దరూ కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించు కుంటున్నారు. ప్రస్తుతం ప్రమాదంలో మరణించిన వారిలో చిన్న నాగన్న, బి.నాగమ్మలు భార్యాభర్తలు. మిగిలిన వారు కూడా బంధువులు. ఒకే సామాజిక వర్గానికి చెందిన బంధువులు ఇలా ఒకే రోజు మరణించడంతో ఎల్లుట్ల దళిత వాడలో తీవ్ర విషాద ఛాయలు అలముకున్నాయి.

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శిస్తున్న మంత్రి సవిత

బాధిత కుటుంబాలకు సిఐటియు, వ్యకాసం పరామర్శ

రోడ్డు ప్రమాదంలో మరణించిన, గాయపడిన బాధిత కుటుంబ సభ్యులను అనంతపురం సర్వజనాసుపత్రిలో సిపిఎం, సిఐటియు వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.ఓబులు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి మాట్లాడుతూ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధిత కుటుంబాలను ఆదుకునే బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ కూలీలకు స్థానికంగా పనులు లేక ఇతర గ్రామాలకు వెళ్తూ తరుచూ ఇలా ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దీనిపై స్పందించి ప్రతి గ్రామంలోనూ విరివిగా ఉపాధి పనులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వ్యవసాయ కూలీలకు సమగ్రమైన చట్టం చేసి స్థానికంగా పనులు కల్పించి పనికి తగ్గ వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మరణించిన ఒక్కొక్కరికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలన్నారు. ప్రతి కుటుంబానికి మూడు ఎకరాల సాగుభూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ దిగ్భ్రాంతి

రోడ్డు ప్రమాదంలో ఏడుగురు కూలీలు మృతి చెందిన ఘటనపై శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటన అత్యంత విషాదకరమైనదన్నారు. మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢసానుభూతి తెలియజేశారు. అధికారులు బాధితులకు అండగా నిలిచి, వారికి సరైన చికిత్స అందేలా చూడాలని ఆదేశించారు. బాధితులకు కూటమి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని ఎమ్మెల్యే తెలిపారు.

ఆర్టీసీ రీజినల్ ఛైర్మన్, ఎస్పీ పరిశీలన

రోడ్డు ప్రమాదం విషయం తెలుసుకున్న కడప ఆర్టీసీ రీజినల్ ఛైర్మన్ పూల నాగరాజు, అనంతపురం ఎస్పీ పి.జగదీష్‌లు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదం జరిగిన తీరును స్థానికులతో అడిగి తెలుసుకున్నారు. ప్రమాద బాధితులను ఆదుకుంటామని, గాయాపడిన వారికి మెరుగైన వైద్య సేవలు అందించేలా అన్ని చర్యలూ తీసుకుంటామని ఆర్టీసీ రీజినల్ ఛైర్మన్ పూల నాగరాజు తెలియజేశారు.

బాధిత కుటుంబాలను ఆదుకోండి : సిపిఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్

'గార్లదిన్నె మండలం తలగాసిపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎనిమిది మంది వ్యవసాయ కూలీలు మరణించడం అత్యంత విచాకరం. కూలి పనుల కోసం ఆటోలో వెళ్తున్న వారిని ఆర్టీసీ బస్సు ఢీ కొనడంతో ఒకే సారి ఇంత మంది మరణించడంతో ఆ కుటుంబాలు రోడ్డున పడ్డాయి. ఈ ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించాలి. మరణంచిన ఒక్కొక్క కూలీకి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి. క్షతగాత్రులకు మెరుగైన వైద్య చికిత్సలు అందించేలా చూడాలి'.

బాధితులకు సహకారం అందిస్తాం
కలెక్టర్ వినోద్‌కుమార్

ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలతోపాటు, గాయపడినవారికి సహాయ సహకారాలు అందిస్తాం. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం మృతులకు ఐదు లక్షల రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందించింది. గాయపడిన వారిలో ఒకరికి సీరియస్ ఉండగా కిమ్స్ సవేరా ఆసుపత్రికి తరలించాం. ప్రమాద ఘటన స్థలాన్ని పరిశీలించాం. రోడ్డు ప్రమాదాల నివారణకు తగ్గిన చర్యలు చేపడతాం.

ప్రభుత్వం అండగా ఉంటుంది.. : ఎంపీ అంబికా

ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలను ఎంపీ అంబికా లక్ష్మినారాయణ పరామర్శించారు. బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసానిచ్చారు. ఇటువంటి ఘటన చోటు చేసుకోవడం దురదృష్టకరం. మృతులకు ప్రభుత్వం ఐదు లక్షల రూపాయలు నష్ట పరిహారాన్ని అందించింది. గాయపడిన వారికి మెరుగైన వైద్య చికిత్స కోసం అవసరమైన తోడ్పాటును అందిస్తుంది.

సంబరంగా సత్యసాయి జయంత్యుత్సవం

- ముఖ్య అతిథిగా గవర్నర్ అబ్దుల్ నజీర్
- పాల్గొన్న మంత్రులు సత్యకుమార్ యాదవ్, సవిత, ఎమ్మెల్యేలు
- సత్యసాయి బాబా సేవలు ఆదర్శనీయం :గవర్నర్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

సత్యసాయి బాబా 99వ జయంతి వేడుకలు పుట్టపర్తిలో సంబరంగా జరిగాయి. దేశ, విదేశాలకు చెందిన భక్తులు, పర్యాటకులు వేడుకలను తిలకించేందుకు పెద్ద సంఖ్యలో పుట్టపర్తికి విచ్చేశారు. భక్తులతో సాయి కుల్వంత్‌హాల్ కిటకిటలాడింది. ముఖ్య అతిథిగా రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ పాల్గొన్నారు. ఈయనతో పాటు రాష్ట్ర మంత్రులు సత్యకుమార్ యాదవ్, సవిత, సత్యసాయి ట్రస్ట్ అధికారి రత్నాకర్, హిందూపురం పార్లమెంటు సభ్యులు బికె.పార్థసారథి, ఎమ్మెల్యేలు పల్లె సింధూరరెడ్డి, ఎంఎస్.రాజు, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు. సత్యసాయి విద్యార్థులు, భక్తులు ఆలపించిన భక్తిగీతాలు అలరించాయి. భక్తుల సౌకర్యార్థం ట్రస్టు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. జయంత్యుత్సవాల సందర్భంగా పలువురు ప్రముఖులు బాబా సమాధిని దర్శించుకున్నారు.

ప్రసంగిస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్

సత్యసాయి బాబా మహాసమాధి వద్ద నివాళులు అర్పిస్తున్న గవర్నర్, ట్రస్టు సభ్యులు, మంత్రి

సత్యసాయి బాబా సేవలు ఆదర్శనీయం
రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్

శ్రీసత్యసాయి బాబా సేవలు ఆదర్శనీయమని రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ కొనియాడారు. బాబా జయంతి ఉత్సవాల్లో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. ముందుగా బాబా సమాధిని సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గవర్నర్ ప్రసంగించారు. సత్యసాయి బాబా భారతీయ సంస్కృతిని ప్రతిబింబిస్తూ లక్షలాది మందిని సేవా మార్గంలో చైతన్యపరిచారన్నారు. సత్యసాయి ట్రస్టు ఆధ్వర్యంలో ప్రస్తుతం అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని చెప్పారు. మొక్కలు నాటే కార్యక్రమం, విద్యార్థులకు పౌష్టకాహారం పంపిణీ, తాగునీరు, వైద్యం ఇలా అనేక సేవా కార్యక్రమాలు ప్రజలకు అందిస్తూ బాబా సేవలను విశ్వవ్యాప్తం చేస్తుండడం గర్వకారణం అన్నారు. సత్యసాయి బాబా మార్గదర్శకత్వంలో శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ చేపట్టిన విద్య, ఆరోగ్య సంరక్షణ, సురక్షితమైన తాగునీటిని అందించడం తదితర సేవా కార్యక్రమాలు భారతదేశం, ప్రపంచవ్యాప్తంగా మానవాళిపై గొప్ప ప్రభావాన్ని చూపుతున్నాయన్నారు. బాబా స్థాపించిన శ్రీ సత్యసాయి ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ 120 కంటే ఎక్కువ దేశాల్లో ఉంటూ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తుండడం గొప్ప కార్యక్రమం అన్నారు. 'శ్రీ సత్యసాయి పేరుతో కొత్త జిల్లా ఏర్పాటు చేయడం ఆయనకు ప్రభుత్వం ఇచ్చిన గుర్తింపు అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధి నాగానంద్, నిమిస్ పాండ్యా, వివిధ రాష్ట్రాల ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

వార్షిక నివేదికను విడుదల చేస్తున్న ట్రస్టు సభ్యులు

గవర్నర్‌కు వీడ్కోలు

సత్యసాయి జయంతి ఉత్సవాల్లో పాల్గొ నేందుకు వచ్చిన గవర్నర్‌కు కలెక్టర్ టిఎస్.చేతన్, అనంతపురం రేంజ్ డీఐజీ షిమోసీ, మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, ఎస్పీ వి.రత్న, ఎఎస్పీ శ్రీనివాసులు, పుట్టపర్తి ఆర్డీవో సువర్ణ, ధర్మవరం ఆర్డీవో మహేష్, పుట్టపర్తి తహశీల్దార్ అనుపమ, ఇతర వీడ్కోలు పలికారు. రోడ్డు మార్గం ద్వారా ఆయన బెంగుళూరుకు వెళ్లారు.

పుట్టపర్తిలో సందడి

సత్యసాయిబాబా 99వ జయంతి సందర్భంగా పుట్టపర్తిలో సందడి వాతావరణం నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి బాబా భక్తులు శనివారం వేకువజాము నుంచే బాబా మహా సమాధిని దర్శించుకున్నారు. జయంతి సందర్భంగా పుట్టపర్తి పరిసర ప్రాంతాల్లో భక్తులకు అన్నదానాలు, ప్రసాదాలను పంపిణీ చేశారు. బాబా చిత్రపటాలు ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహించారు. పుట్టపర్తి ప్రశాంతి నిలయం రైల్వే స్టేషన్ వద్ద, సత్యసాయి భక్తులు ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమంలో వేలాదిమంది సత్యసాయి భక్తులు, ప్రయాణికులు పాల్గొన్నారు. పర్యాటకులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా పోలీసు, ఆర్టీసీ, మునిసిపల్ తదతర అన్ని శాఖల ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు ఏర్పాటు చేశారు.

'పురం'ను మోడల్‌గా తయారు చేద్దాం

రోడ్డు విస్తరణ చర్యలు చేపట్టండి - కమిషనర్‌కు ఎమ్మెల్యే బాలకృష్ణ సూచన

ప్రజాశక్తి-హిందూపురం

రాష్ట్రంలోనే హిందూపురం పురపాలక సంఘాన్ని ఒక మోడల్‌గా తయారు చేద్దామని, దానికి అవసరమైన నిధులను రాష్ట్ర ప్రభుత్వంతో పాటు కేంద్ర ప్రభుత్వం నుంచి తీసుకు వస్తానని ఎమ్మెల్యే నందమూరి బాలకష్ణ తెలిపారు. హిందూపురం రూరల్ మండలంలో జరిగే ఓ శుభ కార్యక్రమంలో పాల్గొనేందుకు బాలకృష్ణ శనివారం సాయంత్రం హిందూపురం పట్టణంకు చేరుకున్నారు. జిల్లా ఎస్‌పి.రత్న, హిందూపురం డీఎస్పీ మహేష్‌తో పట్టణ సిఐలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పట్టణంతో పాటు నియోజకవర్గ వ్యాప్తంగా శాంతి భద్రతల పైన కొద్దిసేపు చర్చించారు. అనంతరం టిడిపి కౌన్సిలర్లతో పాటు ఇటీవల వైసిపి నుంచి టీడీపీకిలోకి చేరిన కౌన్సిలర్లు బాలకష్ణను కలిశారు. ఈ సందర్భంగా ఛైర్మన్ ఎంపికపై వారు చర్చించారు. దీంతోపాటు తాత్కాలిక ఛైర్మన్‌గా బలరామిరెడ్డిని ఎంపిక చేసిన విషయాన్ని వారు బాలకష్ణ దష్టికి తీసుకువచ్చారు. దీనిపై బాలకష్ణ ఇప్పటికే కౌన్సిల్ సమావేశం జరిగి మూడు నెలలు గడిచిందని, ఈ ఒక్క సమావేశం ప్రస్తుత ఛైర్మన్ అధ్యక్షతన నిర్వహించుకోవాలని, వచ్చే సమావేశంలో లోపు రమేష్ కుమార్‌ను ఛైర్మన్ గా ఎంపిక చేసుకుని అతని అధ్యక్షతన మిగిలిన సమావేశాలను నిర్వహించుకుందామని సూచించారు. మున్సిపల్ కమిషనర్ సంఘం శ్రీనివాసులతో పలు అభివద్ధి విషయాలపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా ఇప్పటికే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు డిపిఆర్ సిద్ధం చేసి పంపించిన వివరాలను కమిషనర్ వివరించారు. పట్టణంలో ప్రతి ఇంటికి నల్ల కనెక్షన్ ఇవ్వడంతో పాటు పురపాలక సంఘ వ్యాప్తంగా పైప్ లైన్ అన్నింటినీ మార్చడానికి కోసం రూ. 120 కోట్లతో ప్రతిపాదనలను సిద్ధం చేశామన్నారు. రోడ్ల అభివద్ధి కోసం రూ. 92 కోట్లతో ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపడం జరిగిందన్నారు. అండర్ డ్రైనేజీ కోసం రూ. 450 కోట్లు, మురుగు నీరు శుభ్రపరచడానికి కోసం ఎస్‌టిపిల ఏర్పాటుకు రూ. 69 కోట్లు, డంపింగ్ కేంద్రాల్లో ఎంఆర్‌ఎఫ్ ప్లాంట్స్ ఏర్పాటు కోసం రూ.50 కోట్లు, ఇతర అభివద్ధి పనులకు సంబంధించిన ప్రతిపాదనన్నిటిని సిద్ధం చేసి ప్రభుత్వానికి అందించడం జరిగిందన్నారు. వీటన్నింటి పైన సంబంధిత శాఖ మంత్రులతో చర్చించి నిధులను తీసుకువస్తానని బాలకష్ణ అన్నారు. దీంతోపాటు రైల్వే రోడ్డు విస్తీర్ణపై చర్చించారు. నష్ట పరిహారం ఎంత మందికి ఇచ్చారు, తదితర విషయాలను అడిగి బాలకష్ణ తెలుసుకున్నారు. దీనిపై మునిసిపల్ కమిషనర్ డాక్యుమెంట్స్ సరిగా లేని కారణంగా 23 మందికి నష్టపరిహారం ఇవ్వలేదని, మిగిలిన వారందరికీ నష్టపరిహారాన్ని చెల్లించమన్నారు. దీనిపై బాలకష్ణ మాట్లాడుతూ రైల్వే రోడ్డుతో పాటు బెంగళూరు రోడ్డు, పెనుగొండ రోడ్డు, ఆర్‌టిజిటి రోడ్డుతో పట్టణంలో ఇతర రోడ్లు అన్నింటిని విస్తీర్ణ చర్యలు చేపట్టాలని, దానికి అవసరమైన నిధులను రాష్ట్ర ప్రభుత్వం ద్వారా తీసుకు వస్తానని కమిషనర్ కు సూచించారు. అనంతరం పలువురు అధికారులు, టిడిపి నాయకులు బాలకష్ణను కలిశారు. అనంతరం రూరల్ మండలంలో జరిగిన ఓ వివాహ శుభ కార్యక్రమానికి హాజరై వధూవరులను బాలకష్ణ ఆశీర్వదించారు. ఈ కార్యక్రమాలలో అధికారులతో పాటు టిడిపి ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

బాలకృష్ణతో మాట్లాడుతున్న మున్సిపల్ కౌన్సిలర్లు

ఓటరు నమోదు శిబిరాల తనిఖీ

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

బిఎల్‌ఓలు ఓటర్ నమోదు కేంద్రాల్లో ఆదివారం నాడు నిర్వహించే కార్యక్రమంలో పూర్తి స్థాయిలో విధులు నిర్వహించాలని కలెక్టర్ టిఎస్.చేతన్ తెలిపారు. శనివారం సాయంత్రం పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలో ప్రశాంతి నగరం,108,109,110, పోలింగ్ కేంద్రాల్లో, బీడిపల్లి నందు ఓటర్ నమోదు శిబిరాలను కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో పుట్టపర్తి మున్సిపల్ కమిషనర్ ప్రహల్లాద తదితరులు పాల్గొన్నారు, ఈ సందర్భంగా కలెక్టర్ ఆయా బిఎల్‌ఓలతో మాట్లాడుతూ స్పెషల్ సమ్మరీ రివిజన్-2025 భాగంగా ఈరోజు, రేపు జిల్లాలో జరుగుతున్న ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం నందు నూతన ఓటర్లు నమోదు కార్యక్రమం పై కచ్చితంగా బి ఎల్ వోలు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు విధులు నిర్వర్తించాలని తెలిపారు. 18సంవత్సరాలు నిండిన యువత తమ ఓట్లను ఫారం-6లో నమోదు చేసుకోవాలని తెలిపారు. ఫారం-7 ఎవరైనా చనిపోయినవారు మరియు శాశ్వతంగా గ్రామం వదిలిన 7 వారు ఉంటే తెలియచేయాలన్నారు. ఓటరు జాబితాలో ఫొటో, పేరు మార్పు ఉంటే ఫారం-8 ఇవ్వాలని తెలియజేశారు.

ఉపకారాగారంలో సౌకర్యాలపై ఆరా

హిందూపురం : పట్టణంలోని ఉపకారాగారాన్ని స్థానిక జూనియర్ సివిల్ జడ్జి రాజ్యలక్ష్మి శనివారం పరిశీలించారు. ఉప కారాగారంలో ఎంత మంది ఖైదీలు ఉన్నారు, ఎప్పటినుండి ఉన్నారు, ఏ ఏ కేసుల్లో నిందితులుగా ఉన్నారన్న విషయాలను ఉపకారాగార అధికారి హనుమన్నతో అడిగి తెలుసుకున్నారు. వైద్య సౌకర్యాలు, ఆహారం తదితర విషయాలను నేరుగా ఖైదీలతో ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ న్యాయవాది శ్రీనివాసరెడ్డి, న్యాయవాదులు సుదర్శన్, సిద్ధు, లోక్ అదాలత్ హేమావతి పాల్గొన్నారు.

ఆరుబయట చెత్తవేస్తే జరిమానా : కమిషనర్

హిందూపురం : హిందూపురం పట్టణ సుందరీకరణలో భాగంగా బహిరంగ ప్రదేశాల్లో ఎవరైనా చెత్తాచెదారాన్ని పడవేస్తే జరిమానా వేస్తామని మున్సిపల్ కమిషనర్ సంఘం శ్రీనివాసులు తెలియజేశారు. శనివారం పారిశుధ్య పనుల పరిశీలనలో భాగంగా రహమత్ పురంలో కమిషనర్ పర్యటించారు. ఇందులో భాగంగా కొంతమంది తోపుడుబండ్ల వ్యాపారులు, స్థానికులు చెత్తాచెదారాన్ని ఆరుబయట, మురికి కాలువలో వేయడాన్ని గమనించిన కమిషనర్ వెను వెంటనే రూ.500 వంతున అపరాధ రుసుం విధించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మొదటి తప్పుగా రూ.500 అపరాధ రుసుం విధించామని, మరోసారి ఇలా వ్యవహరిస్తే అధిక మొత్తంలో జరిమానా విధించనున్నట్లు తెలిపారు.

ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా మార్చడమే ప్రభుత్వ ధ్యేయం

మంత్రి సత్యకుమార్, ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి



లబ్ధిదారునికి సిఎం సహాయ నిధి చెక్కు అందజేస్తున్న మంత్రి, ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

ఎపిని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా మార్చడమే ప్రభుత్వ ధ్యేయమని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ తెలిపారు. పట్టణంలోని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శనివారం నియోజకవర్గంలోని 13 మంది లబ్ధిదారులకు మంజూరైన సుమారు రూ. 19 లక్షల(సిఎం సహాయ నిధి) చెక్కులను మంత్రి సత్యకుమార్, ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్‌రెడ్డి బాధిత కుటుంబాలకు అందజేశారు. వారు మాట్లాడుతూ కష్టంలో, ఆపదలో ఉన్న ప్రతి కుటుంబానికి అండగా ఉంటామని సిఎం చంద్రబాబు ఆర్థిక భరోసా ఇచ్చార న్నారు. బుక్కపట్నంకు చెందిన చీకటి నరేష్‌కు రూ. 4,00,165, వెంగళమ్మ చెరువుకు చెందిన ఈడిగ నీళ్ల రమణకు రూ. 5,13,134, పాముదుర్తిలోని కాలసముద్రం రామక్కకు రూ. 18వేలు, ఓడి చెరువు మండలంలోని కొండకమర్లకు చెందిన అల్లాబకాష్‌కు రూ. 17,500, దేరంగుల ఆదర్శ్‌కు రూ. 45వేలు, కొండకమర్ల కొలిమి ముంతాజ్ వలీఖాన్‌కు రూ. 2,24,100, పెగోళ్ల శంకరమ్మకు రూ. 1,53,930 చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో బుక్కపట్నం మాజీ సర్పంచి సాకే యశోద, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు..

ప్రాధాన్యతాక్రమంలో హామీల అమలు : మంత్రి

పుట్టపర్తి అర్బన్ : ఎన్నికల హామీలను కూటమి ప్రభుత్వం ప్రాధాన్యతా క్రమంలో అమలు చేస్తాం దని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. పుట్టపర్తి నుంచి జిల్లాను మార్చే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. మంత్రి బిజెపి కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేనప్ప టికీ వాటిని అధిగమించి హామీల్లో ఒక్కొక్కటి నెరవేరుస్తున్నామన్నారు. మహారాష్ట్ర ఎన్నికల్లో బిజెపి కూటమి అధిక మెజారిటీ సీట్లు సాధించడం హర్షణీయమన్నారు. అదానీతో జగన్ ముడుపుల విషయమై మంత్రి మాట్లాడుతూ జగన్ ప్రపంచ నేరగాళ్ల జాబితాలో చేరాడన్నారు. ఈ విషయంలో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటాయన్నారు. మంత్రితో పాటు ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు విష్ణువర్ధన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు జిఎం శేఖర్, నాయకులు తలుపుల గంగాధర్, ఉత్తమ రెడ్డి, కొండమరాజు, జ్యోతిప్రసాద్, సురేంద్రబాబు, కత్తి రాజారెడ్డి ఉన్నారు.

ధర్మవరంను సస్యశ్యామలం చేస్తాం

మంత్రి సత్యకుమార్, పరిటాల శ్రీరామ్, చిలకం

రావులచెరువులో గంగపూజ చేస్తున్న మంత్రి సత్యకుమార్, పరిటాల శ్రీరామ్, చిలకం

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి సత్యకుమార్‌యాదవ్, నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్, జనసేనపార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి తెలిపారు. వర్షం నీటిని వృథా కానివ్వకుండా రైతులకు అందిస్తున్నామని తెలిపారు. హంద్రీనీవా నీటి ద్వారా నిండిన మండలంలోని రావులచెరువు వద్ద శనివారం వారు గంగపూజ చేశా రు. అనంతరం ధర్మవరం చెరువు ఆయకట్టుకు నీరు విడుదల చేశారు. ఈ నీరు చిన్నూరు, బత్తలపల్లి, ధర్మపురి, తుమ్మల, తిప్పేపల్లి గ్రామాల పరిధిలోని వందల ఎకరాలకు అందనుంది. దీంతో ఆయా గ్రామాల రైతులు హర్షం వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ గతంలో ధర్మవరం చెరువు పూర్తిస్థాయిలో నిండినా మాజీ ఎమ్మెల్యే బోటు షికార్లు, విలాసాల కోసం ఆయ కట్టుకు నీరు విడుదల చేయలేదని విమర్శించారు. హామీ మేరకు తాము ఆయ కట్టుకు నీరు విడుదల చేశామని గుర్తు చేశారు. భవిష్యత్తు లో నియోజకవర్గంలోని ప్రతి చెరువును నింపడమే కాకుండా ప్రతి ఎకరాకు నీరందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు చింతలపల్లి మహేష్‌చౌదరి, పురుషోత్తంగౌడ్, చెన్నారెడ్డి, బిజెపి, జనసేన నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అదానీని అరెస్టు చేయాలి : సిపిఎం

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

పెద్దఎత్తున అవినీతి, అక్రమాలకు పాల్పడిన అదానీని తక్షణమే అరెస్టు చేయాలని, అదానీ గ్రూపుతో రాష్ట్ర ప్రభుత్వం చేసుకొన్న విద్యుత్‌తో పాటు అన్ని రకాల ఒప్పందాలను రద్దు చేయాలని సిపి ఎం నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని సిపిఎం కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జంగాలపల్లి పెద్దన్న మాట్లాడుతూ సెకి నుంచి రాష్ట్ర డిస్కంలు విద్యుత్ ఒప్పందాలు చేసుకునేందుకు అదానీ గ్రూపు భారీ ముడుపులు చెల్లించిన నేపథ్యంలో రాష్ట్రంలో అదానీ కంపెనీ చేసుకున్న విద్యుత్, ఇతర ఒప్పందాలను వెంటనే రద్దు చేసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పంప్డ్ స్టోరేజ్ విద్యుత్ ప్లాంట్లు, విశాఖపట్నంలో డేటా సెంటర్, గంగవరం పోర్టు వంటి వివిధ ప్రాజెక్టులకు అదానీ గ్రూపు సంస్థలతో గత వైసిపి ప్రభుత్వం ఒప్పందాలు చేసుకొని ప్రభుత్వ ఆస్తులు, ప్రజల సంపదను ధారాదత్తం చేసిందన్నారు. ఆ ఒప్పందాలను అన్నింటినీ రద్దు చేసి అదానీతో పాటు ఈ కుంభకోణం వెనుక ఉన్న వారందరినీ విచారించి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి ఎ.మారుతి, సీనియర్ నాయకులు ఎస్‌హెచ్.బాషా, చేనేత కార్మిక సంఘం జిల్లా నాయకులు గుంపు హరి, గోపి, తదితరులు పాల్గొన్నారు.

గవర్నర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

గవర్నర్‌ను కలిసిన ఎమ్మెల్యే రాజు

ప్రజాశక్తి-మడకశిర

పుట్టపర్తిలో జరిగిన శ్రీసత్యసాయి బాబా 99వ జయంతి వేడుకలకు హాజరైన రాష్ట్ర గవర్నర్ నజీర్‌అహ్మద్‌ను శనివారం ఎమ్మెల్యే ఎంఎస్.రాజు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గవర్నర్ ఎంఎస్.రాజును ఆప్యాయంగా పలకరిస్తూ టిటిడి సభ్యులుగా నియామకం కావడం పట్ల శుభాకాంక్షలు తెలిపారు. దీంతో సంతోషం వ్యక్తం చేసిన రాజు రాష్ట్ర గవర్నర్‌కు ధన్యవాదాలు తెలిపారు. అలాగే రాజ్‌భవన్‌కు వచ్చి కలవాలని రాజుకి సూచించారు.

ఫుట్‌బాల్ పోటీల విజేత మడకశిర

ప్రజాశక్తి-మడకశిర

పట్టణంలోని జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో ఆర్డీటీ, ఎఎస్ఎ, ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడా పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. పోటీల్లో మడకశిర, అగళి, పరిగి నార్త్, సౌత్ అండర్-8, 10 జట్లు పాల్గొన్నాయి. చివరకు మడకశిర-బి జట్టు ఆర్డీటీ క్వాలిఫైడ్ మ్యాచ్‌కు ఎంపికైంది. ఫిజికల్ డైరెక్టర్లు నాగభూషణం, ప్రకాష్, బాలాజీ జగదీష్ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు.

వర్క్ ఇన్స్‌పెక్టర్ మృతికి మాజీ ఎమ్మెల్యే నివాళి

ప్రజాశక్తి-బుక్కపట్నం

బుక్కపట్నంకు చెందిన వర్క్‌ఇన్‌స్పెక్టర్ ఆదినారాయణ శనివారం అనారోగ్యంతో మృతి చెందా డు. విషయం తెలిసిన వెంటనే మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి వారింటికి వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట వైసిపి నాయకులు రాచంరెడ్డి భాస్కర్‌రెడ్డి, సర్పంచి నాగలక్ష్మి రాజు, కార్యకర్తలు ఉన్నారు. పాల్గొన్నారు.

బాలయ్యకు ఘన స్వాగతం

ప్రజాశక్తి-చిలమత్తూరు

హిందూపురం రూరల్ మండల అధ్యక్షుడు అశ్వర్థనారాయణరెడ్డి కుమారుడి వివాహ వేడకకు వస్తున్న ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణకు చిలమత్తూరు మండలం కూటమి నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ఎస్సీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బేకరీ గంగాధర్, మండల కన్వీనర్ రంగారెడ్డి, నందీశప్ప ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బాలయ్యకు గజమాల వేసి శాలువాతో సత్కరించి ఘనంగా సన్మానిం చారు. కార్యక్రమంలో జనసేన నాయకులు చిన్నా ప్రవీణ్, రమణ, టిడిపి నాయకులు గొల్ల నాగరాజు పాల్గొన్నారు.



బాలయ్యకు స్వాగతం పలుకుతున్న గంగాధర్

వడ్డెర్ల అభివృద్ధికి ప్రభుత్వం కృషి : ఎమ్మెల్యే

ఎమ్మెల్యే సింధూరను సన్మానిస్తున్న వడ్డెర సంఘం నాయకులు

ప్రజాశక్తి-కొత్తచెరువు

వడ్డెర్ల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి తెలిపారు. అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యే వడ్డెర్ల స్థితిగతులు, సమస్యలను ప్రస్తావించారు. దీంతో శనివారం కొత్తచెరువులో స్థానిక వడ్డెర టిడిపి నాయకులు ఆమెను ఘనంగా సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే వడ్డే ఓబన్న విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టౌన్ కన్వీనర్ వలిపి శ్రీనివాసులు, టిడిపి నాయకులు నల్లమాడ శంకర్, పద్మావతి,లక్ష్మీదేవి, నాగమణి, పెద్దక్క, తదితరులు పాల్గొన్నారు.

సేవాగుణం అలవర్చుకోవాలి : ఎమ్మెల్యే

పుట్టపర్తి అర్బన్ : సమాజంలో ప్రతి ఒక్కరూ సేవాగుణం అలవర్చుకోవాలని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి సూచిం చారు. శ్రీసత్యసాయి బాబా జయంతి సందర్భంగా శనివారం పట్టణంలోని వాసవీ సత్రం సముదాయం లో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటుచేశారు. ముందుగా ఎమ్మెల్యేతో పాటు మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డికి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు దేవికి వెంకటేశ్వర్లు, కమిటీ నాయకులు పోలేపల్లి ప్రవీణ్, ప్రశాంత్, జగదీష్, కలవల రాంకుమార్, శంకర్ బాబు తదితరులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు శ్రీరామ్ రెడ్డి, బొమ్మయ్య, సామకోటి ఆదినారాయణ, ముద్దపాటి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు వేగవంతం చేయండి : ఎమ్మెల్యే

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీత

ప్రజాశక్తి-చెన్నేకొత్తపల్లి

టిడిపి సభ్యత్వ నమోదును వేగవంతం చేసి రాష్ట్రంలోనే రాప్తాడు నియోజకవర్గాన్ని అగ్రస్థానంలో నిలపాలని ఎమ్మెల్యే పరిటాల సునీత పార్టీ శ్రేణులకు సూచించారు. చెన్నేకొత్తపల్లి, రామగిరి మండల కేంద్రాల్లోని పార్టీ శ్రేణులు, ముఖ్య నాయకులతో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. పార్టీకి కార్యకర్తలే బలమన్నారు. మనం అధికారంలో లేనప్పుడే పార్టీపై ప్రజలకు ఎంతో నమ్మకం ఉండేదని, ఇప్పుడు ఆ నమ్మకం మరింత పెరిగిందన్నారు. కావున సభ్యత్వం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించి అధిక సంఖ్యలో సభ్యత్వాలు నమోదు చేయించాలన్నారు. మీకు ఏవైనా సమస్యలు ఉంటే నా దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తానని తెలిపారు. పింఛన్లు, రేషన్ కార్డులు, తదితర సమస్యలను సంబంధిత మంత్రుల దృష్టికి తీసుకెళ్లామని అవి త్వరలోనే వస్తాయన్నారు.

ధర్నా చేస్తున్న సిఐటియు నాయకులు, పంచాయతీ కార్మికులు

పంచాయతీ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి-ముదిగుబ్బ

స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట శనివారం సిఐటియు ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులు ధర్నా నిర్వహించారు. సిపిఎం మండల కార్యదర్శి ఆటో పెద్దన్న మాట్లాడుతూ ముదిగుబ్బ మేజర్ పంచాయతీలో పని చేస్తున్న కార్మికులకు ఆర్డర్ కాపీ, కనీస వేతనం రూ. 26 వేలు, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తింపు, పిఎఫ్, ఈఎస్ఐ, తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలని, దహన సంస్కారాలకు రూ. 15వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ధర్నాలో సిఐటియు మండల కార్యదర్శి బండల వెంకటేశు, ఆవాజ్ కమిటీ మండల కార్యదర్శి బాబ్‌జాన్, టైలర్ ముస్తఫా, రఫీ, నౌషద్, పంచాయతీ కార్మికులు ఆదినారాయణ, ఓబులేసు, సావిత్రి, హరి, తదితరులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-చిలమత్తూరు

స్థానిక ఎమ్మార్సీలో శనివారం యుటిఎఫ్ మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా అనిల్‌కుమార్, అధ్యక్షుడిగా పి.శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శిగా జి.లక్ష్మీపతి, ట్రెజరర్‌గా జగదీష్, పలువురు కమిటీ సభ్యులను ఎన్నుకున్నట్లు తెలిపారు. నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలపై రాజీలేని పోరాటాలతో పాటు విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

ఎంపి బికె.పార్థసారధికి సన్మానం

ప్రజాశక్తి-రొద్దం

మండలంలోని ఆర్.మరువపల్లిలో శనివారం ఎంపి బికె.పార్థసారధిని పరిగి మండలంలోని శ్రీబీరలింగేశ్వర ఆలయ కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఎంపి దంపతుల ఫొటోను అందించారు. అలాగే ఎంపి బికె.పార్థసారధిని రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన కేశవయ్య మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు.



ఎంపి బికె దంపతులను సన్మానిస్తున్న యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కేశవయ్య

సదరం సర్టిఫికెట్ చూపుతున్న చిన్నారి హిమశ్రీ

'సారూ.. పింఛను మంజూరు చేయండి'

ప్రజాశక్తి-తనకల్లు

స్థానిక ఇందిరానగర్‌లో కందుకూరి పుష్ప, మహేష్ దంపతులు నివాసం ఉంటున్నారు. మహేష్ డ్రైవింగ్ వృత్తి చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. వారికి ముగ్గురు సంతానం కాగా ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. వారికి సొంత ఇల్లు కూడా లేదు. వారి రెండో సంతానమైన హిమశ్రీ పుట్టుకతోనే బుద్ధి మాంద్యంతో జన్మించింది. చిన్నారికి సదరంలో బుద్ధిమాంద్యం 77 శాతం ఉన్నట్లు డాక్టర్లు ధ్రువీకరించి ధ్రువీకరణ పత్రం మంజూరు చేశారు. ఆ సర్టిఫికెట్‌తో స్థానిక సచివాల యంలో దరఖాస్తు చేసుకున్నా ఇంతవరకు పింఛను మంజూరు కాలేదని చిన్నారి తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి పింఛను మంజూరు చేయించాలని పుష్ప, మహేష్ కోరుతున్నారు.

'ఉపాధి' కూలీల సంఖ్య పెంచాలి

ప్రజాశక్తి-నల్లచెరువు

మండలంలో ఉపాధి హామీ పనులకు హాజరయ్యే కూలీల సంఖ్యను పెంచాలని డ్వామా పిడి విజయప్రసాద్ ఆదేశించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శనివారం ఎంపిడిఒ అధ్యక్షతన ఉపాధి హామీపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డ్వామా పిడి విజయప్రసాద్, ఎపిడి రమేష్ మాట్లాడుతూ 2,200 మంది కూలీలకు పని కల్పించాలన్నారు. క్యాటిల్ షెడ్లను ఈ నెలాఖరు లోపు పూర్తి చేయాలన్నారు. హార్టికల్చర్ ప్లాంటేషన్ మొక్కలను పూర్తి స్థాయిలో నాటించాలని ఆదేశించారు. సమావేశంలో ఎపిఒ, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పోస్టాఫీసులో రూ. 200కే ఖాతా

ప్రజాశక్తి-నంబులపూలకుంట

ప్రజల సౌకర్యార్థం తపాలా శాఖలో రూ. 200కే వ్యక్తిగత ఖాతా తీసుకోవచ్చని కదిరి పోస్టల్ ఇన్‌స్పెక్టర్ గోవర్ధన్‌నాయక్ తెలిపారు. స్థానిక పోస్టాఫీస్‌ను శనివారం ఆయన పరిశీలించి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాయని, వాటిని ప్రజలకు సకాలంలో అందించడానికి తపాలా శాఖ చర్యలు తీసుకుంటుందని తెలిపారు. అందులో భాగంగా వ్యక్తిగత ఖాతాలు తెరవాలని ప్రజలకు సూచించారు. మండలంలో ఎన్‌పి కుంట, పి.కొత్తపల్లి, పెడబల్లి, మరికొమ్మ దిన్నె, గొకనపల్లి, టిఎన్.పల్లి, వెలిచెలిమల, ధనియానిచెరువు గ్రామాల్లోని తపాలా కార్యాలయాల్లో ఖాతాలు తెరవాలని ఆయన సూచించారు.

విత్తన వేరుశనగ పంపిణీ

ప్రజాశక్తి-నంబులపూలకుంట

రబీ సీజన్‌లో పంట సాగు చేసే రైతులకు విత్తన వేరుశనగ పంపిణీ చేస్తున్నట్లు ఏవో లోకేశ్వర్ రెడ్డి తెలిపారు. మండలంలోని 10 రైతు సేవా కేంద్రాల్లో 900 క్వింటాళ్ల విత్తన వేరుశనగ సిద్ధంగా ఉందని తెలిపారు. బోర్ల కింద సాగు చేసే రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ నాయకులు పాల్గొన్నారు.

నేడు వనభోజనాలు

ప్రజాశక్తి-గోరంట్ల

మండలంలోని కమ్మవారిపల్లి పంచాయతీలోని ఎముకులగుట్టపల్లి వద్ద ఉన్న మినీ తిమ్మమ్మ మర్రిమాను వద్ద ఆదివారం గోరంట్ల మండల బలిజ సంఘం ఆధ్వర్యంలో కార్తీక వనభోజనాలు కార్యక్రమం నిర్వహిస్తామని బలిజ సంఘం నాయకులు ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యాప్తంగా ఉన్న బలిజ సామాజిక వర్గం ప్రజలు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

పాఠశాల తనిఖీ

ప్రజాశక్తి-పరిగి

మండలంలోని కాలువపల్లి విద్యానిధి కళాశాలను, పరిగి జడ్పీ హైస్కూల్‌ను ఎంఇఒలు లక్ష్మీదేవి, శేషాచలం సందర్శించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి విద్యార్థికీ ఆధార్ తరహాలో విద్యార్థి అపార్ ఐడిని కేటాయిస్తుందన్నారు. దీనికి సంబంధించి యాజమాన్యం విద్యార్థుల నమోదును పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల నిర్వాహకుడు ఎల్లారెడ్డి పాల్గొన్నారు.

అత్యాచార నిందితులను శిక్షించాలి : ఎస్ఎఫ్ఐ

మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి హర్షకుమార్

ప్రజాశక్తి-పెనుకొండ టౌన్

విశాఖలో లా విద్యార్థినిపై అత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి హర్షకుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మహిళలకు రక్షణ కల్పిస్తున్నామని చెబుతున్నా ఆచరణలో కనిపించడం లేదన్నారు. దాడులు, అత్యాచారాలకు మత్తు పదార్థాలు, మద్యమే ప్రధాన కారణమని వాటిని నియంత్రించాల న్నారు. హోం మంత్రి మహిళ అయినా రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేదన్నారు. ఇకనైనా మహిళలు, విద్యార్థినులపై జరుగుతున్న దాడులు, అత్యాచారాలను అరికట్టాలని, మహిళా రక్షణ చట్టాలను పటిష్టం గా అమలు చేయాలని, లేనిచో రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరిం చారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ విజయంపై హర్షం

ప్రజాశక్తి-సోమందేపల్లి

ఝార్ఖండ్‌లో కాంగ్రెస్ ఘన విజయం, కేరళలోని వయనాడ్ పార్లమెంటు నియోజకవర్గంలో ప్రియాంకగాంధీ అత్యధిక మెజార్టీతో గెలుపొందడంపై శనివారం స్థానిక కాంగ్రెస్ పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ గంగాధర్ మాట్లాడుతూ బిజెపి నియంతృత్వ పాలనకు రోజులు దగ్గరపడ్డా యన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా బ్యాలెట్‌తో ఎన్నికలు నిర్వహిస్తే కాంగ్రెస్ దేశంలోనే అత్యధిక మెజార్టీతో ఘనవిజయం సాధిస్తుందన్నారు. బిజెపి కపటనీతి, మతతత్వ రాజకీయాలు, పెట్టుబడిదారులకు సహాయం చేసి పేదలకు అన్యాయం చేస్తుందన్నారు. ఎన్నికల్లో పెట్టుబడిదారులను ఉపయోగించుకొని విజయాలు సాధిస్తుందని ఇది శాశ్వతం కాదన్నారు. భవిష్యత్తు కాంగ్రెస్ పార్టీదే అని, దేశ ప్రజలు కాంగ్రెస్ పాలనను కోరుకుంటున్నారని తెలిపారు.

గోరంట్ల : ఝార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం, కేరళలోని వయనాడ్‌లో కాంగ్రెస్‌పార్టీ ఎంపిగా ప్రియాంకగాంధీ గెలుపొందడంపై పెనుకొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి నరసింహులు హర్షం వ్యక్తం చేశారు. ప్రియాంక గాంధీ అత్యధిక మెజారిటీతో గెలుపొందడం హర్షించదగ్గ విషయం అన్నారు.

బింగిలికుంటలో మరమ్మతులు

కుంటలో మరమ్మతులకు పూజ చేస్తున్న సంస్థ సభ్యులు

ప్రజాశక్తి-రొద్దం

టింబక్ట్ కలెక్టివ్ సంస్థ ఆధ్వర్యంలో శనివారం శ్యాపురం గ్రామంలో ఉన్న బింగిలికుంట మరమ్మతులు చేపట్టారు. టింబక్ట్ కలెక్టివ్ సంస్థ సభ్యులు మాట్లాడుతూ గ్రామ ఉమ్మడి వనరులు, నీటి వనరులు, మరమ్మతులు, పూడికతీత కార్యక్రమాలు చేపట్టామన్నారు. రొద్దం, చెన్నేకొత్తపల్లి, రామగిరి, మండలాల్లో రాయలసీమ వాటర్ ప్రాజెక్ట్ కార్యక్రమం చేపడతామన్నారు. ఇందులో భాగంగా శ్యాపురం, బింగిలికుంట మరమ్మతులను ప్రారంభించినట్లు తెలిపారు. రాయలసీమ వాటర్ ప్రాజెక్ట్ మేనేజర్ పేరూరు శ్రీకాంత్ మాట్లాడుతూ 30 ఏళ్ల నుంచి కుంట మరమ్మతులు చేపడుతూ ఈ కుంట నుంచి 30 ఎకరాలకు నీరందిస్తున్నా మన్నారు. కార్యక్రమంలో రాయలసీమ వాటర్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ కె.రవి, కల్పవల్లి సేంద్రియ, వ్యవసాయ కోఆర్డినేటర్ సన్నప్పయ్య, ప్రవీణ్, కార్యకర్త సజ్జప్ప, కమ్యూనిటీ రీసోర్స్‌పర్సన్, జన చైతన్య సమైక్య లీడర్లు, సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

ఓటుపై అవగాహన ర్యాలీ

ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, రెవెన్యూ సిబ్బంది

ప్రజాశక్తి-చిలమత్తూరు

ఓటు హక్కు సక్రమంగా వినియోగించుకున్నప్పుడే దేశ ప్రగతి సాధ్యమని డిప్యూటీ తహశీల్దార్ జగన్నాథ్ తెలిపారు. రెవెన్యూ అధికారులు శనివారం స్థానిక పాఠశాల విద్యార్థుల తో కలిసి ఓటు హక్కుపై పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. డిటి మాట్లాడుతూ 18 ఏళ్ల నిండిన ప్రతిఒక్కరూ ఓటు హక్కు కోసం నమోదు చేసుకోవాలన్నారు. ఓటు హక్కును వినియోగించుకుని ఉత్తమ నాయకత్వాన్ని దేశానికి అందించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ నేల కొటప్ప, జూనియర్ అసిస్టెంట్ శంకర్, కంప్యూటర్ ఆపరేటర్ అనూజ, రెవెన్యూ సిబ్బంది, పాల్గొన్నారు.

సిపిఎం మండల కార్యదర్శిగా వెంకటేష్

ప్రజాశక్తి-చిలమత్తూరు

సిపిఎం మండల కార్యదర్శిగా రెండోసారి వెంకటేష్‌ను ఎన్నుకున్నట్లు సిపిఎం సీనియర్ నాయకులు ప్రవీణ్‌కుమార్ తెలిపారు. వెంకటేష్‌ని కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని ఆయన తెలిపారు. వెంకటేష్ మాట్లాడుతూ ప్రజావ్యతిరేక విధానాలను ఖండిస్తూ ప్రజా ఉద్యమాలను ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు రామచంద్ర, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

మహిళల్లో చైతన్యం పెంపొందించాలి

సదస్సులో మాట్లాడుతున్న న్యాయవాదులు

ప్రజాశక్తి-కదిరి టౌన్

మహిళలు శక్తి సామర్థ్యాలు, చైతన్యం, నైపుణ్యం పెంచుకోవాలని సీనియర్ న్యాయవాదులు నరసింహులు, లోకేశ్వర్‌రెడ్డి సూచించారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని ఐసిడిఎస్ కార్యాలయంలో పిడి ఎం. రాధిక అధ్యక్షతన మహిళా న్యాయ సదస్సు నిర్వహించారు. ఆర్డీటీ ఆర్‌డి శాంతమ్మ ఆర్డీటీ ద్వారా మహిళలకు అందుతున్న సౌకర్యాలను వివరించారు. ఐసిడిఎస్ పిడి రాధిక మాట్లాడుతూ గ్రామాల్లో మహిళలను చైతన్య పరచాలని తెలిపారు. సదస్సులో అంగన్వాడీ సూపర్వైజర్లు రామలక్ష్మి, ప్రభావతి, అలివేలమ్మ, మహిళా సంఘం రాజేశ్వరి, పాల్గొన్నారు.

బిడ్డకు జన్మనిచ్చి తల్లి మృతి

ప్రజాశక్తి-బత్తలపల్లి

స్థానిక ఆర్డీటీ ఆసుపత్రిలో శనివారం ఓ గర్భిణి మగబిడ్డకు జన్మనిచ్చి ఆ తర్వాత ఆమె మృతి చెందింది. బంధువులు తెలిపిన వివరాలు.. బెళుగుప్పకు చెందిన ఆంజనేయులు బుధవారం తన భార్య శారద(27)ను ప్రసవం కోసం ఆర్డీటీ ఆసుపత్రిలో చేర్పించగా ఆరోగ్యశ్రీ కింద వైద్యసేవలు అందించారు. వైద్యుల సూచన మేరకు శనివారం ఆమె కాన్పుల వార్డులో నడుస్తుండగా పురిటి నొప్పులు వచ్చాయి. దీంతో బంధువుల వినతి మేరకు వైద్యులు సిజేరియన్ చేయగా ఆమె మగ బిడ్డకు జన్మనిచ్చి, ఆ తర్వాత మృతి చెందిందని వైద్యులు తెలిపారన్నారు. అయితే సిజేరియన్ చేయడంలో వైద్యులు ఆలస్యం చేశారని వారు వాపోయారు. మొదటి కాన్పులో శారదకు సిజేరియన్ చేయగా ఆడ బిడ్డకు జన్మనిచ్చిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

పెను విషాదాలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం జిల్లాలో ఈ వారంలో పలు పెనువిషాదాలు చోటు చేసుకున్నాయి. శనివారం నాడు జరిగిన రోడ్డు ప్రమాదం అతి పెద్ద దుర్ఘటన కాగా, అంతక మునుపు విద్యుత్ తీగలు తెగిపడి తండ్రీకుమారుడు మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. ఇక నార్పలలో ముగ్గురు ఆత్మహత్య చేసుకున్నారు. ఇలా ఈవారంలో అనేక దుర్ఘటనలు చోటు చేసుకున్నాయి. యల్లనూరు మండలం దంతలపల్లి గ్రామానికి చెందిన తండ్రీకుమారుడు మోటర్ సైకిల్‌పై పోతున్న సమయంలో విద్యుత్ తీగలు తెగిపడి విద్యుదాఘాతానికి గురై మృతి చెందారు. ఇటువంటి ఘటనలు జిల్లాలో గతంలోనూ చోటు చేసుకున్నాయి. ఈ ఏడాది ఒక్కటే 103 మంది విద్యుత్‌ఘాతానికి గురై చనిపోవడం జరిగింది. ఇవి గత ప్రభుత్వ హయాంలో పెద్దఎత్తున చోటు చేసుకున్నాయి. తాడిమర్రి మండలంలో ఆటోపై విద్యుత్ తీగలు తెగిపడి వ్యవసాయ కూలీలు చనిపోవడం సంచలనం రేపింది. ఈ ఘటనలకు గల కారణాలను అప్పట్లో అన్వేషించారు. విద్యుత్ శాఖలో ప్రధానంగా క్షేత్రస్థాయి సిబ్బంది కొరత ఉంది. కీలకమైన లైన్‌మెన్ల కొరత ఈ ప్రమాదాలకు చాలా వరకు కారణమవుతోంది. అయితే ప్రభుత్వాలు మారుతున్న ఈ సమస్యలపై దృష్టి సారించడం లేదన్న విమర్శలున్నాయి. సామాన్యుల ప్రాణాలు మాత్రం గాల్లో కలిసిపోతున్నాయి ఇక శనివారం నాడు ఆర్టీసీ బస్సు, ఆటో ఢీకొన్న ప్రమాదంలో ఏడుగురు వ్యవసాయ కూలీలు మృత్యుతవాడ్డారు. అంతా వ్యవసాయ కార్మికులే. రెక్కాడితేగాని డొక్కాడని కుటుంబాలే. పెద్ద దిక్కుగా ఉన్న వారు చనిపోతే ఆ కుటుంబాలు నిరాశ్రయంగా మారుతున్నాయి. ఈ రకంగా వ్యవసాయ కూలీలు మృతి చెందిన ఘటన గతంలో గార్లదిన్నెలోనూ చోటు చేసుకుంది. అప్పుడు ఇటువంటి పరామర్శలే వచ్చాయి. అయితే ఆ తరువాత పట్టించుకునే వారులేక ఆ కుటుంబాలు ఇప్పటికీ ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి. ప్రధానంగా క్షతగాత్రులుగానున్న వారి కుటుంబాలు ఇక్కట్లు ఎదుర్కొంటున్నాయి. రోడ్డు ప్రమాదాలశ్రీను నివారిస్తామని ఇటీవలనే జిల్లా రోడ్డు భద్రతా కమిటీ చర్చించింది. బ్లాక్‌స్పాట్‌ను గుర్తించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటామని ప్రకటించింది. అయితే ఈ ప్రమాదాలు మాత్రం ఆగడం లేదు. ఏటా 500 మందికిపైగా రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందుతున్నారు. నార్పలలో రుణభారంతో భార్య, భర్త, కుమార్తె ముగ్గురు ఒకేసారి చనిపోవడం పెద్ద చర్చనీయాంశమమైంది. కొవిడ్ సమయం నుంచి వ్యాపారాలు దెబ్బతిన్నాయి. ఈ ఆర్థిక ఇబ్బందులు ఇప్పటికీ వ్యాపారులను వెన్నాడుతూనే ఉన్నాయి. నార్పలలో ఆత్మహత్య చేసుకున్న కుటుంబం కూడా వ్యాపారం చేసుకునే కావడం గమనార్హం. ఇటువంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఈ వారంలో వరుసగా మూడు ప్రధాన దుర్ఘటనలు జిల్లాలో జరిగాయి. ఇక ప్రధానమైన ఘటనల్లో సత్యసాయి జిల్లాలో సత్యసాయి జయంతి ఉత్సవాలు జరిగాయి. ఈ ఉత్సవాలను రాష్ట్ర గవర్నర్ నజీర్ అహమ్మద్ పాల్గొన్నారు. వారం రోజులుగా సత్యసాయి జయంతి ఉత్సవాలు వైభవంగా జరిగాయి.

ఘనంగా సత్యసాయి జయంతి వేడుకలు

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

శ్రీసత్యసాయిబాబా 99వ జయంతి సందర్భంగా శనివారం పట్టణం లోని యాదవ వీధిలో జనసేన పార్టీ నాయకులు డిష్ రాజు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం, దుస్తులు పంపిణీ, అన్నదాన కార్యక్ర మాలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి హాజరై సత్యసాయి సేవలను కొనియాడారు. అనంతరం మహిళలకు చీరలు, రక్తదాతలకు పండ్లు పంపి ణీ చేశారు. అన్నదాన కార్యక్రమంలో పాల్గొని ప్రజలకు భోజనం వడ్డించారు. చెన్నకేశవపురం ఎర్రగుంట సర్కిల్‌లో మంత్రి సత్యకుమార్ యాదవ్ పూజలు చేసి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు డోలా రాజారెడ్డి, జింకా చంద్రశేఖర్, కంపరాజు, అంజి, సుధాకర్, భాస్కర్ పాల్గొన్నారు.

ధర్మవరంలో అన్నదాన కార్యక్రమంలో భోజనం వడ్డిస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

కొత్తచెరువు : శ్రీసత్యసాయి బాబా జయంతి వేడుకలను సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సత్యసాయి భజన మందిరం, నెహ్రూ కూడలి, పాత ఆంధ్ర బ్యాంకు వద్ద సత్యసాయి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నారాయణ సేవలో భాగంగా ఎలమందల రవి, మెడికల్ స్టోర్ సుబ్రహ్మణ్యం, సత్యసాయి భక్తులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో శంకర్‌బాబు, నాగేంద్ర, రఘు, కేశవరెడ్డి, వెంగముని, బెల్లం నజీర్, తదితరులు పాల్గొన్నారు.

కొత్తచెరువు రూరల్ : మండలంలోని కేశపురం శ్రీసత్యసాయి పంప్ హౌస్ వద్ద శ్రీసత్యసాయి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శ్రీసత్యసాయి తాగునీటి పథకంలో పనిచేస్తున్న కార్మికులు సత్యసాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహిం చారు. కార్యక్రమంలో సత్యసాయి నీటి పథకం కార్మికులు రాము, శ్రీనివాసులు, రెడ్డెప్ప, రాములప్ప, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

కదిరి అర్బన్ : శ్రీసత్యసాయిబాబా జయంతి సందర్భంగా పట్టణంలోని మున్సిపల్ హైస్కూల్ ఆవరణలో హెచ్‌ఎం నాగరాజు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పూల మొక్కలు నాటారు. హెచ్‌ఎం బాబా సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవినాయక్, సోమశేఖర్, చెన్నకేశవులు, రమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

బత్తలపల్లి : శ్రీసత్యసాయి బాబా జయంతి సందర్భంగా మండలంలోని సత్యసాయి వాటర్ ట్యాంకుల వద్ద బాబా చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. మండలంలోని 40 గ్రామాల్లో సత్యసాయి తాగునీటి కొళాయిల వద్ద మహిళలు పూజలు చేశారు. మాల్యవంతంలోని బాబా మందిరంలో ప్రత్యేక పూజలు చేసి అన్నదానం ఏర్పాటు చేశారు. మాల్యవంతం, అప్రాచెరువు సమీపంలోని సత్యసాయి నీటి పంపుల వద్ద కార్మికులు బాబా చిత్రపటానికి పూజలు చేశారు. బత్తలపల్లి వీధుల్లో కార్మికులు బాబా చిత్రపటాన్ని ఊరేగించి అన్నదానం చేశారు. కార్యక్రమాల్లో మండలంలోని సూపర్వైజర్లు, కార్మికులు, భక్తులు పాల్గొన్నారు.

తలుపుల : స్థానిక మూడు రోడ్ల కూడలిలో బాబా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిం చారు. పలువురు సత్యసాయి సేవలను కొనియా డారు. కార్యక్రమంలో ఎద్దుల రాముడు, ఈశ్వరయ్య, తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి రూరల్ : రెడ్ క్రాస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పెడపల్లి ఉన్నత పాఠశాలలో శ్రీసత్యసాయి చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు. సొసైటీ మేనేజింగ్ డైరెక్టర్ రమేష్, ఆర్గనైజింగ్ కమిటీ నాగేష్, వైద్య శాఖ అధికారి డాక్టర్ కుళ్లాయప్పనాయక్, హైస్కూల్ హెచ్‌ఎం చెన్నకృష్ణారెడ్డి సత్యసాయి సేవలను కొనియాడారు. అనంతరం విద్యార్థులకు ప్రసాదం పంచి పెట్టారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేశులు, రామ్మూర్తి, నాగభూషణం, సురేష్, సూర్యనారాయణ, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

ముదిగుబ్బ : సత్యసాయి భక్తులు బాబా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో అంబటి చలపతి, కృష్ణవేణి, హరినాథ్, జయశ్రీ, మాధవి, మెడికల్ స్టోర్ వాసు, జ్యోతి, హనుమంతు, సూరి, సాయిలీల, భానుశ్రీ, అఖిల, తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి భక్తుల అన్నదాన శిబిరాలు

పుట్టపర్తి రూరల్ : శ్రీసత్యసాయిబాబా 99వ జయంతి సందర్భంగా శనివారం పుట్టపర్తి పరిసర ప్రాంతాల్లో భక్తుఉలు పలుచోట్ల అన్నదానం ఏర్పాట్లు చేశారు. ప్రశాంతి గ్రామంలోని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఎదు రుగా సాయి ప్రశాంతి భక్త బృందం ఆధ్వర్యంలో ఉదయం నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకూ భోజ నం అందజేశారు. ముందుగా సత్యసాయి చిత్రపటానికి భక్తులు పూజలు నిర్వహించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. బస్టాండ్ సమీపంలోని ఆటో స్టాండ్ వద్ద భక్తులు ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్ర మంలో మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు. రైల్వే స్టేషన్, గణేష్ కూడలి, చిత్రావతి రోడ్డు, యనమలపల్లి సర్కిల్, సత్యమ్మ ఆలయం, తదితర ప్రాంతాల్లో సైతం అన్నదానం, మజ్జిగ, తాగునీరు పంపిణీ చేశారు. ట్రస్టు ఆధ్వర్యంలో ప్రశాంతి నిలయంలో ఈ నెల 18 నుంచి 24వ తేదీ వరకు ఉచిత అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు.

స్కూల్ హెల్త్ స్క్రీనింగ్ ప్రోగ్రాం తనిఖీ

నల్లచెరువు : మండలంలోని చెవిటివారిపల్లి పాఠశాలలో జరుగుతున్న ఆర్‌బిఎస్‌కె స్కూల్ హెల్త్ స్క్రీనింగ్ ప్రోగ్రాంను శనివారం జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ నివేదిత తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ మండలంలోని అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో పిహెచ్‌సి సిహెచ్ఒ రామచంద్రారెడ్డి, ఎఎన్‌ఎం సరస్వతి, శ్రావణి, హెల్త్ అసిస్టెంట్లు శ్రీనివాసరెడ్డి, నారాయణ, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు, హెచ్‌ఎం, టీచర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంప్యూటర్ విద్య అవసరం

ఓబుళదేవరచెరువు : కంప్యూటర్ పరిజ్ఞానంతో విద్యార్థులకు భవిష్యత్తులో మెరుగైన అవకాశాలు లభిస్తాయని, ప్రతి విద్యార్థి కంప్యూటర్‌పై అవగాహన పెంచుకోవాలని మండలంలోని కొండకమర్ల జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం భాస్కర్ సూచించారు. కార్యక్రమంలో ఫ్రీజం ఒకేషనల్ ట్రైనర్ స్వర్ణలత, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

'ప్రత్యేక ఓటరు నమోదు' పరిశీలన

మడకశిర : ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా శనివారం కొత్తపాళ్యం పోలింగ్ బూత్‌ను తహశీల్దార షెక్షావలి, సీనియర్ అసిస్టెంట్ ఉమామంజునాథ్‌రావు పరిశీలించారు. వారు మాట్లాడుతూ అవకతవక లకు తావు లేకుండా ఓటరు నమోదు కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోండి

ప్రజాశక్తి-బత్తలపల్లి

18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని తహశీల్దార్ స్వర్ణలత సూచించారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా శనివారం ఆమె మండలంలోని మాల్యవంతం, సంజీవపురం గ్రామాల్లో ఓటరు నమోదు కేంద్రాలను పరిశీలించారు. దరఖాస్తులను భర్తీ చేసే విషయంలో అశ్రద్ధ చూపవద్దని, ఖచ్చితమైన సమాచారాన్ని పొందుపరచాలని బిఎల్‌ఎలను ఆదేశించారు.

మాల్యవంతంలో ఓటరు నమోదు కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న తహశీల్దార్ స్వర్ణలత

విద్యార్థులకు బహుమతి అందజేస్తున్న ప్రిన్సిపల్ నారాయణరెడ్డి

సాంకేతిక పరిజ్ఞానంతో ఉత్తమ భవిష్యత్తు

ప్రజాశక్తి-హిందూపురం

నేటి ఆధునిక సమాజంలో ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో శాస్త్ర పరిజ్ఞానాన్ని అలవర్చుకోవాలని సప్తగిరి ఎంబిఎ, ఎంసిఎ కళాశాల ప్రధానాచార్యులు నారాయణరెడ్డి విద్యార్థులకు పిలుపునిచ్చారు. సప్తగిరి కళాశాలలో ఎంబీఏ, ఎంసీఏ సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులకు స్వాగత కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ నారాయణరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శివశంకర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు కోర్సుల అనంతరం నేరుగా ప్రతి ఒక్కరూ ఉద్యోగ జీవితంలో అడుగుపెట్టేందుకు నిరంతర కషి ఎంతైనా అవసరం అన్నారు. సాంకేతికతను అలవరచుకున్నప్పుడే ఉద్యోగాలకు వెళ్లేందుకు రాచబాట ఏర్పాటు అవుతుందన్నారు. ఎంబీఏ కళాశాల ప్రిన్సిపాల్ నారాయణరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు శాస్త్ర, సాంకేతిక రంగాల్లో సంపూర్ణ అవగాహన కలిగించేందుకు తమ వంతు కషి చేస్తున్నట్లు తెలిపారు. తమ కళాశాలలో క్రమశిక్షణతో కూడిన విద్యాభ్యాసాన్ని విద్యార్థులకు అందిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు వ్యాపార రంగాల్లో మెళకువలపై నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనపరచిన వారికి బహుమతులను అందజేసినట్లు ఎంబీఏ, ఎంసీఏ కళాశాలల ప్రిన్సిపాల్ నారాయణరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో కళాశాల పాలనాధి కారి గంగిరెడ్డి, ఎంబీఏ ,ఎంసీఏ కళాశాలల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి.

చేపల పెంపకానికి వేలం

ప్రజాశక్తి-గుడిబండ

మండలంలోని కొంకల్లు గ్రామ చెరువులో చేపల పెంపకం కోసం శనివారం ఈవోఆర్‌డి నాగరాజునాయక్, సర్పంచి కవిత ఓబన్న, పంచాయతీ కార్యదర్శి హరీష్ ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహించారు. వేలంలో వివిధ గ్రామాల నుంచి వేలం పాటదారులు పాల్గొన్నారు. గుడిబండ గ్రామానికి చెందిన రాజు రూ. 2.15 లక్షలకు అత్యధికంగా వేలం పాడి దక్కించుకున్నట్లు పంచాయతీ కార్యదర్శి హరీష్ తెలిపారు. వేలంలో టిడిపి, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

26న మహాధర్నా జయప్రదం చేయండి

ప్రజాశక్తి-కదిరి టౌన్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ ఈ నెల 26వ తేదీ కలెక్టరేట్ వద్ద చేపడుతున్న ధర్నాను జయప్రదం చేయాలని ప్రజా సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం పట్టణంలో ఎపి రైతు సంఘం, సిఐటియు ఆధ్వర్యంలో మహాధర్నా కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి సుబ్బిరెడ్డి, సిఐటియు నాయకులు జిఎల్.నరసింహులు, జగన్మోహన్, ముస్తాక్, రామ్మోహన్, రఫీ, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ధర్నా కరపత్రాలు పంపిణీ చేస్తున్న సిఐటియు నాయకులు

మహాధర్నా పోస్టర్లు విడుదల

ఓబుళదేవరచెరువు : బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక వ్యతిరేక విధానాలపై ఈ నెల 26వ తేదీ రైతు సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద చేపట్టనున్న ధర్నాను జయపద్రం చేయాలని సిఐటియు నాయ కులు పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం స్థానిక బస్టాండ్ ప్రాంతంలో సిఐటియు ఆధ్వర్యంలో కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి లక్ష్మీనారా యణ, మండల కార్యదర్శి కుళ్లాయప్ప, ట్రాన్స్‌పోర్ట్ జిల్లా కార్యదర్శి పెడబల్లి బాబా, మండల నాయకులు రమణ, శ్రీరా ములు, రామారావు, శ్రీనివాసులు, వేణు, శివ, అంజి, బాషా, తదితరులు పాల్గొన్నారు.

గుంతల రోడ్డుతో ట్రాఫిక్‌కు అంతరాయం

ప్రజాశక్తి-నంబులపూలకుంట

మండలంలోని ధనియానిచెరువు సమీపంలో కదిరి-రాయచోటి రోడ్డుపై శనివారం వాహనాలు నిలిచి పోయాయి. రోడ్డు గుంతల మయంగా ఉండటం వల్ల సుమారు 4 గంటల పాటు రాకపోకలు స్తంభించాయి. సకాలంలో గమ్యస్థానానికి చేరుకోవడానికి ఇబ్బందులు పడాల్సి వచ్చిందని వాహన చోదకులు, ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా శాఖ అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

బురదలో ఇరుక్కుపోయిన వాహనాలు

అనారోగ్యంతో అంగన్వాడీ వర్కర్ మృతి

ధర్మవరం రూరల్ : పట్టణంలోని రాజేంద్రనగర్ సెక్టార్ పరిధిలో అంగన్వాడీ వర్కర్‌గా పని చేస్తున్న ఎం.అరుణ అనారోగ్యంతో బెంగళూరులోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. ఆమె మృతదేహాన్ని శనివారం పట్టణానికి తీసుకువచ్చారు. విషయం తెలిసిన వెంటనే అంగన్వాడీ సూపర్ వైజర్ లతాకిరణ్మయి, సిఐటియు మండల కన్వీనర్ జెవి.రమణ, సెక్టార్ లీడర్లు దీన, పోతక్క, కార్య కర్తలు వారింటికి వెళ్లి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ అరుణ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకో వాలని, ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో అనిత, లక్ష్మీదేవి, గంగ, నాగమణి, సునీత, రత్నమ్మ, సుజాత, రాధ పాల్గొన్నారు.

కొంకల్లులో టిడిపి సభ్యత్వ నమోదు

గుడిబండ : మండలంలోని కొంకల్లు గ్రామంలో శనివారం డాక్టర్ సెల్ అధ్యక్షులు డాక్టర్ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో టిడిపి నాయకులు సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. వారు ఇంటింటికీ వెళ్లి సభ్యత్వ నమోదు వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించి సభ్యత్వం చేయించారు. కార్యక్రమంలో బూత్ కన్వీనర్ నాగరాజు, బిసి సెల్ తాలూకా అధ్యక్షులు రామాంజనేయులు, టిఎన్‌ఎస్‌ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు మురళిబాబు, నాయకులు నరసింహప్ప, భోజన్న, నరసింహమూర్తి, శివన్న, ఓబన్న, పుట్టప్ప, తదితరులు పాల్గొన్నారు.

బకాయి బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-హిందూపురం

అంగన్వాడీ కేంద్రాల నిర్వహణకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న అద్దె, గ్యాస్ బకాయిలను వెంటనే చెల్లించాలని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఇన్‌ఛార్జి ప్రాజెక్టు డైరెక్టర్ వరలక్ష్మికి ఏపీ అంగన్వాడి వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ప్రతినిధులు విన్నవించారు. ఈ మేరకు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని శనివారం ఆమెకు అందజేశారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ కార్యదర్శి శోభారాణి, అధ్యక్షురాలు అరుణ, సిఐటియు పట్టణ నాయకులు విఆర్.రాము మాట్లాడుతూ అంగన్వాడీ సెంటర్‌లో ప్రీస్కూల్ పిల్లలకు వండుతున్న కూరగాయలు, నిత్యావసరాల బిల్లులు అందక అప్పులు చేసి వండిపెట్టి ఇబ్బంది ఎదుర్కొంటున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. గ్యాస్‌కు సంబంధించిన బిల్లులు కూడా పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. సిడిపిఒ సెక్టర్ పరిధిలో ఉన్న ప్రతి సెంటర్‌కు వెళ్లి వర్కర్ల వద్ద డబ్బులు డిమాండ్ చేస్తున్నారని తెలిపారు. తమ సమస్యలపై గతంలో రెండుసార్లు పీడీ, ఆర్డీవో, కలెక్టర్ కార్యాలయాల వద్ద ఆందోళనలు చేశామన్నారు. ఇంతవరకు సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. ఇప్పటికైనా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేపడతామన్నారు. కార్యక్రమంలో హిందూపురం ప్రాజెక్ట్ కోశాధికారి శశికళ, ఉపాధ్యక్షురాలు మంజుల. సహాయ కార్యదర్శి అనిత, కమిటీ సభ్యులు శైలమ్మ, జయసుధ, సుప్రజ, మాధవి, భాగ్యమ్మ, శాంతమ్మ, శివమ్మ ,భారతి, శ్రీవల్లి, అంజలి పాల్గొన్నారు.